# పాలకూర సీతాలత

# బొబ్బట్ల ప్రేమి


రుద్రమూర్తికి బొబ్బట్లు అంటే చాలా ఇష్టం. నెలకు ఒకసారి అయినా కడుపునిండా, సంతృప్తిగా బొబ్బట్లు ఆరగించని బ్రతుకూ ఒక బ్రతుకేనా అంటాడు. ఆ ఇష్టం అతను ఈ మధ్య పెంచుకున్నది కాదు. చిన్నప్పటి నుంచీ వున్నదే. అతనికి ఆరేళ్ల వయసు వుండగా వచ్చిన తాతగారి తద్దినం రోజున పేచీ పెట్టాడు—

"గారెలు వద్దురా? బొబ్బట్లు చెయ్యండి" అన్నాడు.

"బొబ్బట్లు చెయ్యకూడదురా; గారెలే చెయ్యాలి" అంది అతని తల్లి.

కాళ్లు, చేతులు కొట్టుకుంటూ ఏడ్చాడు. తన సలహా ఎవ్వరూ పట్టించు కోవటం లేదని విలవిల లాడి పోయేడు. 'కొడతాను వెధవా... నోరుముయ్యి...' అని తండ్రి కోప్పడ్డాడు. దాంతో అయిష్టంగా అక్కడ నుంచి వెళ్ళి పోయాడు.

అతనికి దేవుళ్ళందరి మీదా కోపం వచ్చింది. బొబ్బట్లు ఇష్టపడే దేముడు లేకపోవడం అతనికి బాధ




కలిగించింది. వినాయకుడికి ఉండ్రాళ్లే ఇష్టం. నాగుల చవితి నాగన్నకు పాలు, చిమ్మిలీ ఇష్టం. శ్రీరాముడికి వడపప్పు, పానకం. ఆంజనేయుడికి అప్పాలు ఇష్టం. బొబ్బట్లు ఇష్టపడే ఒక కొత్త దేముడు పుట్టాలని అతను కోరుకున్నాడు.

అంతేకాదు... అతనికి పండుగల మీద కూడా కోపం వచ్చింది. ఉండ్రాళ్ల తద్ది, అట్లతద్ది లాగ బొబ్బట్ల తద్ది ఎందుకు లేదు! ఏ దసరాకో దీపావళికో బొబ్బట్లు చేస్తారు కానీ ఇలాగ ఏడాదికి రెండేసార్లు తినడం అతనికి నచ్చదు. 'మాస శివరాత్రి' ప్రతీనెలా వచ్చినట్లే 'మాస బొబ్బట్ల తద్ది' ప్రతినెలా వుండాలని కోరుకున్నాడు. కాని ఏం చేస్తాం! అతని కోరిక తీరదు కదా?

పుట్టిన రోజునాడు తల్లి అడిగేది "ఏం చెయ్యమంటావురా!"

"బొబ్బట్లు " అనేవాడు. అతని ప్రతీపుట్టిన రోజునా బొబ్బట్లు వుండాలి.

అతని దురదృష్టవశాత్తు అతని తల్లి అతను పదోక్లాసు చదువుతుండగా పోయింది. కనుక అతను అన్న, వదినెలతో వుండసాగాడు. వదిన దగ్గర పెద్ద చనువు లేదు. పైగా ఆమెకు మామూలుగా అన్నం వండి, చారు చెయ్యడానికే బద్ధకం. కూర చెయ్యవలసి వచ్చిన రోజున ఆపసోపాలు పడిపోతూంది. అందుకే తల్లిని అడిగినంత చనువుగా వదినని బొబ్బట్ల గురించి అడిగేవాడు కాదు. ఆ కోరికను బలవంతంగా చంపుకునేవాడు. అన్నగారి దగ్గరవున్న రెండు సంవత్సరాలలో వదినగారు ఒక్కసారి చేసింది బొబ్బట్లు. అవి




కూడా పెద్దగా రుచిగా లేవు.

తర్వాత అతను వేరే ఊళ్ళో కాలేజీలో చేరాడు. హాస్టల్లో చేర్పించాడు అతన్ని వాళ్ల అన్నయ్య. మెస్‌లో భోజనం. మెస్సులో బొబ్బట్లు ఎవరు చేస్తారు!

బొబ్బట్లు అతనికి అందకుండా పోయినందువల్ల బొబ్బట్లు అంటే మరింత ఇష్టం కలిగింది. 'తినగా తినగా గారెలు చేదు' అన్న సామెతలాగా 'తినకపోగా తినకపోగా బొబ్బట్లు మరింత తీపి' అన్న కొత్త సామెత పుట్టింది అతని వల్ల.

బొబ్బట్లకు తగిన విలువ ఎవ్వరూ ఇయ్యడం లేదని వాపోయేవాడు రుద్రమూర్తి. అతనిలో కొన్ని కొత్త ఆలోచనలు కలిగాయి.

'రాష్ట్రస్థాయిలో బొబ్బట్ల అభిమాన సంఘం' ఒకటి స్థాపించి అందుకు తను అధ్యక్షుడిగా వుంటే!

ఇతర రాష్ట్రాలలో స్థిరపడిపోయిన ప్రవాసాంధ్రులందర్నీ కూడా ఇందులో చేర్చుకుని ఈ సంఘానికి జాతీయస్థాయిలో గుర్తింపు కలిగించాలి.

తర్వాత ఆ సంఘం తరపున ఆందోళన లేవదీసి ఇటు ముఖ్యమంత్రికి, అటు ప్రధాన మంత్రికి కూడా కోరికల మెమొరాండం సమర్పించాలి.

ఆ కోరికలు ఇవి...

1) బొబ్బట్లకు ఇడ్లీ, గారెలతో సమాన ప్రతిపత్తి కల్పించాలి. హోటళ్ళలో ఇడ్లీ, గారె అమ్ముతున్నంత విరివిగా బొబ్బట్లు కూడా అమ్మాలి.

2) బొబ్బట్ల వంట ప్రోత్సహించడానికి గాను బొబ్బట్లు చేసుకుందుకు కొనే సెనగపప్పు, బెల్లంపై కొన్ని రాయితీలు ప్రకటించాలి.

3) ప్రతీ తెలుగు కుటుంబం నెలకొక సారి బొబ్బట్లు చేసుకుతీరాలన్న నియమం విధించాలి.


4) ఆ నియమం పాటిస్తున్నారా లేదా అన్న విషయం స్పష్టం చేసుకుందుకు అన్ని హక్కులతో ఒక ప్రత్యేక కమిటీ వెయ్యాలి.

5) బొబ్బట్లు తినక పోవడం వల్ల ఏఏ విటమిన్లు లోపిస్తాయో పరిశీలించి, ఆ విటమిన్ లోపం ఏజబ్బులకు కారణం అవుతుందో తెలుసుకుని బొబ్బట్ల ఆవశ్యకత

గురించి విరివిగా ప్రచారం చెయ్యాలి.

ఈ డిమాండ్లు తయారు చేసి తన స్నేహితులకి చూపించాడు. రుద్రమూర్తిని చూసినవాళ్లు తేలిగ్గా నవ్వి ఊరుకున్నారు. దాంతో చప్పబడి పోయేడు.

ఆ రాత్రి తన ఆలోచనలన్నీ అమలు జరిపినట్లు కల వచ్చింది. జాతీయ స్థాయిలో ఆందోళన జరుపుతున్న రుద్రమూర్తితో ప్రధాని సంప్రదింపులు జరిపారు — **కలలో.**




"వాటీజ్ బొబ్బట్లు!" అడిగేరు అతన్ని ప్రధాని.

"బొబ్బట్లు ఈజ్... ఈజ్.." అంటూ ఇంగ్లీషులో చెప్పడానికి చాలా కష్టపడ్డాడు అతను. రుద్రమూర్తి కోరికలు సమంజసమైనవని గుర్తించి అతని డిమాండ్లను ప్రధాని అమలు జరిపారు. అతని పేరు రేడియోల్లో, న్యూస్ పేపర్లలో మార్మ్రోగిపోయింది.

అతను ఏ ఆందోళనా చెయ్యలేకపొయ్యాడు. అతనికి ఎవరూ సహకరించలేదుమరి.

అతని చదువు పూర్తయ్యింది. అదృష్టవశాత్తూ ఉద్యోగం కూడా దొరికింది.

అతనికి పెళ్లి చెయ్యడం కోసం వాళ్ల అన్నయ్య సంబంధాలు చూడసాగేడు.

పెళ్లి చేసుకోబోతున్నందుకు రుద్రమూర్తికి సంతోషం కలిగింది. తనకొక ఇల్లు ఏర్పడుతున్నందుకు, భార్య వస్తుందన్నందుకూ కాదు. భార్య చేత బొబ్బట్లు చేయించుకుని తినవచ్చునని.

* * *

అతను అన్న, వదినలతో వసుంధరను చూసుకుందుకు వెళ్లాడు.

అమ్మాయి అందంగా కడిగిన ముత్యంలా వుంది. చదువుకున్నది.

వ్యవహారం అంతా అన్నగారే నడిపిస్తున్నాడు.

"అబ్బాయి ఏమైనా అడగదల్చుకుంటే అడగమనండి.." అన్నాడు వసుంధర తండ్రి బ్రహ్మ.

"మీకు బొబ్బట్లు చెయ్యడం వచ్చా!" అని అడగాలనుకున్నాడు రుద్రమూర్తి.

"అబ్బే .. అడిగేది ఏముంది లెండి?.." అన్నాడు అతని అన్నగారు. దాంతో రుద్రమూర్తి మాట్లాడలేదు. 'ఆ' తెలుగమ్మాయికి బొబ్బట్లు వండటం రాదా ఏం! అని సరిపెట్టుకున్నాడు అతను.

"ఏరా! అమ్మాయి నచ్చిందా!" అని అడిగాడు అతన్ని అన్నగారు.

నచ్చలేదని చెప్పడానికి ఏ లోపము లేదు. నచ్చిందన్నాడు.

"శుభం? ముహూర్తాలు పెట్టుకుందాం.." అన్నాడు అన్నయ్య.

'ఈ వసుంధర ముఖం బొబ్బట్టులా, ఎంత బాగుంది?' అనుకున్నాడు రుద్రమూర్తి.

పెళ్ళి జరిగిపోయింది.

కాపురం పెట్టేడు.

ఆనందంగా రోజులు గడుపుతున్నారు నవదంపతులు.

* * *

ఒకరోజు రుద్రమూర్తి అన్నాడు భార్యతో.

"నేను బొబ్బట్ల పులిని..."

వసుంధరకు అర్థం కాలేదు.

"ఇదేమిటండీ? నేను బొబ్బిలి పులి గురించి విన్నాను కానీ ఈ బొబ్బట్ల పులి ఏమిటి!"

తనకు బొబ్బట్లు అంటే ఎంత ఇష్టమో వివరించాడు.

తర్వాత అన్నాడు.

"ఏరోజైనా నువ్వు లంచ్ లోకి బొబ్బట్లు చేశావనుకో, లంచ్ లో తింటాను. ఆ సాయంత్రం టిఫిన్ గా తింటాను. రాత్రి భోజనం బదులూ తింటాను. ఆ మర్నాడు




ఉదయం బ్రేక్ ఫాస్ట్ గా తింటాను. నిజానికి ఈ రోజు చేసిన బొబ్బట్లు ఈ రోజు కంటే రేపు బాగుంటాయి. ఇంకా మిగిలితే ఆ మర్నాడు మధ్యాన్నం కూడా తింటాను, భోజనంలో. అంటే ... బొబ్బట్ల విషయంలో నేను పులిని అన్నమాట... అందుకే అలా అన్నాను.."

కొంచెం కొంచెం అర్థం చేసుకుందుకు ప్రయత్నించింది వసుంధర.

"అది సరేగానీ .. బొబ్బట్లు ఎప్పుడు చేస్తావు!" అడిగాడు.

"బొబ్బట్లా ... డావ్ బోర్..." అంది వసుంధర.

నీరు కారిపోయాడు రుద్రమూర్తి.

"ఛ? అదేమిటి వసుంధరా.. అలా అంటావు!" అన్నాడు నీరసంగా.

"నాకు అవి చేయడం రాదు బాబూ? అమ్మ చేస్తుంటే చూసేదాన్ని. బోలెడు శ్రమ." అంది వసుంధర తేలిగ్గా.

రుద్రమూర్తి చప్పబడిపోయాడు.

"నా కోసం.. కొంచెం శ్రమపడలేవూ! అన్నాడు బతిమాలుతూ.

వసుంధరకు జాలి కలిగింది.

"పోనీ మైసుర్ పాక్ చెయ్యనా! రెండూ తియ్యగానే వుంటాయి కదా?" అంది.

అడ్డంగా తల ఊపాడు రుద్రమూర్తి.

"రెండూ చీరలే కదా అని చెప్పి నీకు పాలిస్టర్ చీర మీద మనసు వుంటే నూలు చీరతో సరిపెట్టుకోగలవా!" అడిగేడు అతను.

## ది ఇచ్

ఆ ఊరి పేరు తిమ్మరాజు పాలెం. ఊరంటే చిన్న దన్న మాటే గాని ఉన్న కుటుంబాలన్నీ కలవారి కుటుంబాలే. చాలా మంది చేసేది (కల్తీ) నేతి వ్యాపారం.

జూనియర్ కాలేజీ, ఆసుపత్రి, పబ్లిక్ పార్క్ లాంటి సౌకర్యాలున్న ఆ ఊళ్లో ఒకే ఒక సినిమా హాలుంది. కట్టించిన ప్రభువు టేస్ట్ వున్న మనిషని చెప్పవచ్చును. లోపలి డెకార్, పుష్ బేక్ సీట్లు, ఏ.సి బ్రహ్మాండం.

వారం రోజులై హాలులోపల, వెలుపల అదుపులో పెట్టలేనంత జనం. విరామం లేకుండా ఆటలు (కంటిన్యూయస్ షోలు). ప్రక్క పల్లెల్లోని జనం చిన్న, పెద్ద, ఆడ, మగ ఎడ్ల బండీల మీద, రిక్షాల్లోను తిరనాళ్ళకి వచ్చినట్టు వచ్చేస్తున్నారు. కుంభ మేళాల్లోగాని, పుష్కరాల్లోగాని ఉండరేమోనని పించేంత జనం బారులు బారులుగా క్యూలో నిలబడ్డ జనాన్ని చూస్తే తిరుపతి దేవుని దర్శనం కోసం రాత్రి పగలు క్యూలో నిలబడ్డ భక్తులు గుర్తుకు వస్తారు. అక్కడే భోజనాలు, పడకలు, వారం రోజులై ఆడుతున్న సినిమా ఆంగ్లంలో వచ్చిన లాంగెస్టడే, సౌండ్ ఆఫ్ మ్యూజిక్, రోమన్ హాలిడే, హిందీలో వచ్చిన, కిస్మత్, షోలే, సత్యం శివం సుందరం, తెలుగులో ప్రేమాభిషేకం ప్రతిష్టించిన రికార్డ్ పగల గొట్టేటట్టుంది. ఇప్పుడక్కడున్న జనతీ వ్రతని బట్టి ఆ సినిమా ఆ హాల్లో కనీసం రెండు సంవత్సరాలు జయభేరి మోగిస్తుందని చెప్పవచ్చు. ఇంతకీ ఆ చిత్రం పేరు! అదే విచిత్రం. అక్కడ క్యూలో అష్టకష్టాలకి లోనవుతున్న ఎవరికీ తెలిసినట్టు లేదు.

ఆ చిత్ర నిర్మాణం ఆరు సంవత్సరాల క్రితం ప్రారంభమయిందట. అందులో నటించిన సాంకేతిక నిపుణులు, దర్శకుడు అంతా కొత్తవారే. ఇదేదో మ్యా(డ్) వేవ్ పిక్చర్ అనుకునేరు. అక్కడున్న జనం సినిమా చూసి ఆనందించడానికి రాలేదు. సినిమా ముగింపు వరకూ (మధ్యలో పైకి రావడానికి అనుమతి లేదు) చూసిన ప్రతి ప్రేక్షకునికి అయిదు రూపాయిలు నగదు, స్టెయిన్‌లెస్ స్టీలు గ్లాసు పంచి పెడుతున్నారు. వాటి కోసం ఎగబడుతున్నారు. టికెట్టు లేదు సరికదా బోనస్ కూడానా!

అసలు విషయం— ఆ చిత్రంలో పాల్గొన్న నటీనటులు ఆ ఊరి మోతుబరి నేతి వ్యాపారులు ఆర్జించిన డబ్బు ఏం చెయ్యాలో తెలియక సినిమా వేషం యిచ్చినందుకు ప్రొడ్యూసరికి లక్షలు అర్పించి తెరమీద వాళ్ళ ముఖార విందాలు చూసుకుని ఆనందించి, ఆ ఊరి ప్రజలని ప్రక్క పల్లెల్లోని జనాన్ని సినిమా చూసి అనుభవించమని, వాళ్ళని ఆకర్షించడానికి వేసిన ప్లాను, ఒకే ఒక ప్రింటు (చూసిన ఏ డిస్ట్రిబ్యూటరు కొనడానికి ముందుకు రాక పోవడంతో) తీసి నేషనల్ ఎవార్డ్ కోసం ఆశిస్తున్న వాళ్ళ కోరిక—అదేనండి ఇచ్.

**ఓ.ఆర్.కె.రావ్** ★

వసుంధర మాట్లాడలేదు.

"అవును వసుంధరా? నాదృష్టిలో మైసూర్‌పాక్ నూలు చీరలాంటిది. బొబ్బట్లు పాలిస్టర్ చీర.."

"సరేలెండి? మీ కోసం బొబ్బట్లు చేస్తాను.." అంది వసుంధర.

ఆ మాటలకే గాలి ఊదిన బెలూన్లా ఉబ్బిపోయేడు రుద్రమూర్తి.

"ఎప్పుడు చేస్తావు!"

"రేపు.. ఆలస్యం ఎందుకు!" అంది వసుంధర.

"థాంక్యూ? నువ్వు ఎంత మంచిదానివి వసుంధరా? ఈ శుభ సందర్భంలో ఏదైనా కోరిక కోరుకో. కాదనకుండా తీరుస్తాను." అన్నాడు.

"వద్దండీ? మీ ప్రేమానురాగాలు చాలు. వాటి ముందు ఈ ప్రపంచంలోని సంపదలన్నీ గడ్డిపరకే." అన్న సినిమా డైలాగుకానీ కథల్లో డైలాగుకానీ చెప్పలేదు వసుంధర.


మీ దృష్టిలో బొబ్బట్లు పాలిస్టర్ చీర లాంటిది కదా: అందుకే ఒక పాలిస్టర్ చీర కొనండి." అంది.

"ఓ.కే. గ్రాంటెడ్." అన్నాడు.

ఆ రాత్రి అతనికి సరిగ్గా నిద్రపట్టలేదు. పక్కమీద అటు, ఇటు దొర్లాడు.

"ఎన్నాళ్లో వేచిన రోజు.. ఈనాడే ఎదురౌతుంటే.. ఇంకా తెలవారదేమీ! ఈ చీకటి విడిపోదేమీ! అని పాడుకున్నాడు సన్నగా.

అతను ఉదయం ఎనిమిది గంటలకే వెళ్లిపోతాడు ఆఫీసుకి.




భోజనం కారియర్లో వస్తుంది. అందుకే అన్నాడు.

"ఈ రోజు కారియర్ పంపకు. మధ్యాహ్నం శలవు పెట్టి వచ్చేస్తాను, పాలిస్టర్ చీరతో. సంతృప్తిగా బొబ్బట్లు తినాలంటే కారియర్‌లో కుదరదు" అన్నాడు.

వసుంధర సరేనంది.

మధ్యాహ్నం ఒంటిగంటకి చీరతోపాటు ఇల్లు చేరాడు రుద్రమూర్తి.

విస్తట్లో బూరెలు కనిపించాయి. ఆశ్చర్యపోయాడు.

"చెప్పాను కదా, ఇది నేను మొదటిసారి చెయ్యడం కదా? సెనగపప్పు, బెల్లం రుబ్బుతుంటే పొరపాటున నీళ్లు ఎక్కువ వేశాను. అందుకే అది గట్టిగా రాక పాయసంలా తయారయ్యింది. వేస్టు చెయ్యడం ఎందుకని బూరెలు చేశా..."

నీరుకారి పోయాడు రుద్రమూర్తి. జీవితంలో అంతగా ఎప్పుడూ ఆశాభంగం చెందలేదు. చెయ్యగలిగేది ఏమీ లేదు కనుక మాట్లాడలేదు.

ఆ సాయంత్రం పాలిస్టర్ చీర కట్టుకున్న వసుంధర..

"చాలా బాగుందండీ చీర.."

"కానీ.. నీ బొబ్బట్లే బాగోలేదు.." అని అనలేదు కాని అనుకున్నాడు.

బుద్ధావతారంలా కూర్చుండి పోయేడు పాపం?

* * *

"పెళ్లి జరిగాక వస్తున్న మొదటి పండుగ ఈ దసరా.. తప్పకుండా అమ్మాయిని తీసుకుని వారం రోజులు శలవు పెట్టి రావల్సింది. ప్రయాణపు ఖర్చుకి డబ్బు కూడా పంపుతున్నాను.." అంటూ రుద్రమూర్తి మామగారు బ్రహ్మోత్తరం రాసేడు.

"ఏమండీ.. మనం వెళ్లాలి.." అంది వసుంధర సంతోషంగా.

"అలాగే.." అన్నాడు రుద్రమూర్తి.

పండుగ వారం రోజులు వుండగానే బయలుదేరాడు రుద్రమూర్తి భార్యతో.

రైల్లో వెళ్తుంటే వసుంధర అంది.

"మీరు అక్కడకు వెళ్లాకా అడగాలి. స్కూటర్ కాని ఇయ్యమని కోరాలి. కోపం నటించాలి తెలిసిందా!".

ఆశ్చర్యపోయాడు రుద్రమూర్తి.

"ఏమిటి వసుంధరా ఈ

మాటలు! ఆయనకు ఇలా భారం కలిగించకూడదు. మనకు ఏం తక్కువని ఇలా ఆయన మీద ఆధారపడటం!" అన్నాడు రుద్రమూర్తి.

"ఏం కాదు... నాలుగు సంవత్సరాల క్రితం నాకు బాగా గుర్తు. అక్క మొగుడు ఇలాగే పండుగకు వచ్చి అలిగి స్కూటర్ కోరితే నాన్న కొని ఇచ్చాడు. అక్క మొగుడుకి ఇయ్యగలిగిన వాళ్లు నా మొగుడికి ఇయ్యలేరా! ఈ విషయంలో మీరు ఏం చెప్పినా నేను వినను. మీరు అలగవల్సిందే... స్కూటర్ తీసుకోవల్సిందే.." అంది మొండిగా వసుంధర.

భర్త మూర్ఖంగా ప్రవర్తించి తల్లిదండ్రులకు భారం కలిగిస్తే కూతుళ్లు చింతిస్తారు. భర్తకు నచ్చచెప్తారు. కానీ ఈ వసుంధర అందుకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తోందేమిటి!

రైలు దిగాక రిక్షాలో మరొకసారి హెచ్చరించింది వసుంధర.

"అలాగేలే..." అన్నాడు అయిష్టంగా.

*　　*　　*

అల్లుడుగా ఆ ఇంట్లో రాచమర్యాదలు జరుగుతున్నాయి రుద్రమూర్తికి.

మామగారిని కష్టపెట్టాలని లేదు కానీ ఎవరూ చూడకుండా వసుంధర అలగమని బలవంతం చేస్తూనే వుంది.

ఆ రోజు విజయదశమి.

రుద్రమూర్తికి బట్టలు పెట్టారు. వసుంధర అక్కడే వుంది. తీసుకోవద్దనీ, అలగమనీ కళ్లతో సైగ చేసింది.

"ఎందుకు మామగారు, అనవసరంగా ఈ బట్టలు!" అన్నాడు రుద్రమూర్తి.

"అదేమిటోయ్? ఇది నీకు మా ఇంట్లో తొలి పండుగ. ఏదో మా సంతోషం కొద్దీ?" అన్నాడు బ్రహ్మ.


మాట్లాడకుండా బట్టలు తీసుకున్నాడు రుద్రమూర్తి. కోపంగా తనవైపే చూస్తున్న భార్యను అతను చూడలేదు.

పావుగంట పోయేక అతని దగ్గరకు వచ్చింది వసుంధర.

"నేను చెప్పింది ఏమిటి! మీరు చేసింది ఏమిటి!" అంది కొంచెం కోపంగా.

ఆమెకు నచ్చచెప్పబోయాడు.

"మీరు భోజనం చెయ్యవద్దు. స్కూటర్ ఇయ్యడానికి అంగీకరిస్తే తప్ప భోజనం చెయ్యనని చెప్పండి.




ఏం!" అంది.

"అలాగే ." అన్నాడు.

"అమ్మాయి, కొంచెం ఈ యాలకులు పొడి చెయ్యి." అంటూ వసుంధరను పిలిచింది ఆమె తల్లి.

"యాలకుల పొడి ఎందులోకి!" అడిగాడు యధాలాపంగా రుద్రమూర్తి.

"బొబ్బట్లు చేస్తోంది." అంటూ అక్కడ నుంచి లేచి వెళ్లిపోయింది వసుంధర తల్లి దగ్గరకు.

ఆ మాటలకే పులకించి పోయేడు రుద్రమూర్తి.

ఆహా? బొబ్బట్లు??

ఈ రోజు ఎంత సుదినం ? చాలా రోజుల తర్వాత తను కడుపు నిండా తనకు ఇష్టమైన బొబ్బట్లు తినబోతున్నాడు.

అప్పుడే గుర్తువచ్చింది.. భార్య పెట్టిన కండిషన్.

స్కూటర్ ఇయ్యలేనని మామగారు అంటే....

అటు స్కూటరు — ఇటు బొబ్బట్లు.

ఎలా!

ఏం చెయ్యాలి! స్కూటర్ కోసం బొబ్బట్లు వదులుకోవాలా!

బొబ్బట్ల కోసం స్కూటర్ వదులుకోవాలా!

అతని ఆలోచనలకు తుదిరూపం వచ్చింది. నిశ్చయంగా తల పంకించాడు.

భోజనం వేళ అయ్యింది. మామగారు వచ్చి—

"లేవోయ్? కాళ్లు కడుక్కో..." అన్నాడు.

ఉత్సాహంగా లేచినవాడు భార్య గుర్తు రావడంతో చల్లబడిపోయాడు రుద్రమూర్తి.

"వసుంధర ఏదీ!" అడిగేడు.

"పక్కింటివాళ్లు తాంబూలం ఇయ్యడానికి పిలిస్తే వెళ్లింది. వస్తుందిలే.. నువ్వు వచ్చెయ్యి..." అన్నాడు బ్రహ్మ.

ఉత్సాహంగా వెళ్లి, కాళ్లు కడుక్కుని వచ్చాడు. మామగారితో పాటు విస్తరి ముందు కూర్చున్నాడు.

రకరకాల పదార్థాలతో విస్తరి నిండుగా వుంది. అతని చూపులు బొబ్బట్ల మీదే వుంది. ముందుగా అతని చెయ్యి దానిమీదే పడింది.

ముక్క తెంపి నోట్లో పెట్టుకున్నాడు... చాలా బాగుంది..

చాలా ఏళ్ల క్రితం తల్లి చేసిన బొబ్బట్ల లాగే వున్నాయి.

"ఆహా ? అద్భుతం.. బ్రహ్మాండం.. వెరీనైస్.." అంటూ కామెంట్ చేసి నోటికి పని చెప్పాడు.

అతని పొగడ్తలకు అత్తగారు ఆనంద పడిపోయింది.

"మరి రెండు వేసుకో నాయనా?" అంటూ విస్తరి నింపింది.

అప్పుడే పక్కింటి నుంచి తిరిగి వచ్చింది వసుంధర, చేతిలో తాంబూలంతో. పొగుడుతూ బొబ్బట్లు తింటున్న భర్తను చూసింది.

నిరాశగా నిట్టూర్చింది.

"అమ్మాయి? నువ్వు కూడా కూర్చో.. వడిస్తాను.." అంది ఆమె తల్లి.

"కూర్చో వసుంధరా? బొబ్బట్లు చాలా బాగున్నాయి. ఇలా చెయ్యడం నువ్వు కూడా నేర్చుకో.." అన్నాడు రుద్రమూర్తి.

వసుంధర చిన్నగా మూతి తిప్పుకుంది తప్ప మాట్లాడలేదు.

"అత్తగారూ? మరి రెండు వడ్డించండి.." అన్నాడు రుద్రమూర్తి.

వీరావేశంతో బొబ్బట్లను ఖాళీ చేస్తున్న 'బొబ్బట్ల పులి', వైపు చిరుకోపంతో చూసింది.

అతని కళ్లముందు బొబ్బట్లు తప్ప ఏమీ కనిపించటం లేదు.

వసుంధర కళ్లకు మాత్రం స్కూటరే కనపడుతోంది.

అంకితం: ఈ కథ బొబ్బట్ల ప్రియులకు — ముఖ్యంగా బొబ్బట్లు చెయ్యడం రాని అమ్మాయిల భర్తలకు అంకితం.